క్లుప్తంగా

విద్యుత్ సరఫరాపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డీఈ మహబూబ్ బాషా

బుక్కరాయసముద్రం: బీటెక్ చదువుతున్న ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు విద్యుత్ సరఫరాపై అవగాహన పెంపొందించుకోవాలని బీకేఎస్ 33 కేవీ సబ్ స్టేషన్ డీఈ మహబూబ్ బాషా సూచించారు. శనివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఏపీ ట్రాన్స్‌కో పారిశ్రామిక శిక్షణలో భాగంగా బీకేఎస్‌లో ఉన్న ట్రాన్స్‌కో కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా డీఈ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. భద్రతా ప్రోటోకాల్, లోడ్ మేనేజ్‌మెంట్, ఫాల్ట్ అనాలసిస్, ట్రాన్స్‌ఫార్మర్లు, సర్క్యూట్ బ్రేకర్లు ఐసోలేటర్లు, ప్రొటెక్టివ్ రిలేలు, పవర్ ట్రాన్స్ మిషన్లు డిస్ట్రిబ్యూషన్ విభాగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి ఆర్ఎస్‌లో డీఆర్ఎం పర్యటన



కార్మికులతో మాట్లాడుతున్న డీఆర్ఎం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో శనివారం గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పర్యటించారు. గుంతకల్లు డీఆర్ఎంగా పదవీ బాధ్యతలు చేపట్టాక మొదటిసారిగుత్తికి వచ్చారు. రైల్వే అధికారులు, కార్మికులు డీఆర్ఎంకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఆర్ఎం రైల్వే స్టేషన్‌తో పాటు సీ అండ్ డబ్ల్యూ డిపోను పరిశీలించారు. కార్మికులు, ఉద్యోగులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ ప్రమోద్, స్టేషన్ మేనేజర్ సురేష్ బాబు, డీఎంఈ ముఖేష్, క్రూ కంట్రోలర్ బాల స్వామి, ఏడీఎన్ఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోల్ ప్లే ప్రీ స్కూల్ యాక్టివిటీకి ఎంపిక



మాట్లాడుతున్న అధికారులు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు ఆరో అంగన్‌వాడీ కేంద్రం రోల్ ప్లే ప్రీ స్కూల్ యాక్టివిటీకి ఎంపికైనట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 198 అంగన్ వాడీ పాఠశాలలు ఉన్నాయన్నారు. ప్రతి కేంద్రంలో ప్రతి నెలా ఈసీసీఈడే నిర్వహించి పిల్లల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో డిపార్ట్ మెంట్ ప్రీ స్కూల్ కిట్లు, బుక్స్, కథల పుస్తకాలతో విద్యార్థులకు ఆటపాటలతో ప్రాథమిక విద్య నేర్పించాలన్నారు. కల్లూరు ఆరో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు చేత చేయించిన రోల్ ప్లే ప్రీ స్కూల్ యాక్టివిటీ ప్రథమ వీడియో ద్వారా ఏపీలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



బూదేడులో భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

గార్లదిన్నె: మండలంలోని బూదేడులో శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గ్రామస్తులు , దళిత సంఘాల నాయకులు కలసి భూమి పూజ చేశారు. మొదట అంబేడ్కర్ విగ్రహం, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు దళిత సంఘం నాయకులు మాట్లాడుతూ బూదేడు ఎస్సీ కాలనీ వాసులు అందరూ ఐక్యమత్యంతో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచు శివయ్య, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యుడు ఎల్లన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు తిరు పాలు, ప్రసాద్, బండారు కుళ్లాయప్ప, నాగరాజు, రామాంజనేయులు, ఓబుళపతి, మునెయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నాడు ప్రథమం.. నేడు అధమం



చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- చుక్కలూరు పీహెచ్‌సీలో సమస్యల తిష్ట
- అరకొరగా నిధుల మంజూరు
- సక్రమంగా సరఫరా కాని మందులు
- వైద్యం అందక రోగులు, గర్భిణులు విలవిల


తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు ప్రాథమిక కేంద్రం ప్రసవాల్లో అధమస్థాయిలో ఉంది. గతంలో నెలకు వందకు పైగా ప్రసవాలు జరిగి జిల్లా స్థాయిలో రికార్డు సృష్టించింది. అప్పట్లో చుక్కలూరు ప్రాథమిక కేంద్రం వైద్య సేవల్లో శెభాష్ అనిపించుకుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రకరకాల మొక్కలు పెంచి ఇది ఆస్పత్రా లేక ఉద్యానవనమా అన్న రీతిలో అధికారులు, అనధికారుల నుంచి ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం చుక్కలూరు ప్రాథమిక వైద్య కేంద్రం తిరోగమనంలో పయనిస్తోంది. ప్రసవాలు, రోగుల వైద్య సేవలు, వివిధ రకాల మందుల పంపిణీ కొరత తదితర కారణాలతో పీహెచ్‌సీ సతమతమవుతోంది.

ప్రైవేట్ ఆస్పత్రి బాటలో గర్భిణులు



చుక్కలూరు పీహెచ్‌సీ పరిధిలో దాదాపు 20 గ్రామాలు ఉన్నాయి. గతంలో ఈ గ్రామాల నుంచి ప్రసవాలకు గర్భిణులు ఆసుపత్రికి వచ్చేవారు. అప్పట్లో ఉన్న మెడికల్ ఆఫీసర్ ప్రసవాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆశా వర్కర్లు, ఇతర వైద్య సిబ్బందితో గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేసేవారు. తద్వారా గర్భిణులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి ప్రసవాలకు వచ్చేవారు. అప్పట్లో నెలకు వంద వరకు ప్రసవాలు జరిగేవంటే ఏ స్థాయిలో వైద్య సేవలు అందించేవారో అర్థమవుతోంది. అప్పట్లో ప్రసవాల్లో ఆసుపత్రి జిల్లా స్థాయిలో రికార్డు సృష్టించింది. మెడికల్ ఆఫీసర్ బదిలీ, ఇతర కారణంగా వల్ల నెలనెల ప్రసవాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ప్రసవాల సంఖ్యను పెంచడానికి వైద్యులు ప్రజల్లో అవగాహన కల్పించడంలో పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఆరోగ్య సిబ్బంది తమ స్వప్రయోజనం కోసం గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రులకు రెకమెండేషన్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం నెలకు ఐదు లోపు ప్రసవాలు జరుగుతన్నాయి. ఆస్పత్రిలో ఇద్దరు డాక్టర్లు ఉండగా వారిలో మేల్, మరొకరు ఫిమేల్. కానీ ప్రసవాల సంఖ్య మాత్రం పెరగడం లేదు.

వేధిస్తున్న మందుల కొరత



చుక్కలూరు ప్రాథమిక కేంద్రంలో వివిధ రోగాలకు సంబంధించిన మందుల కొరత ఉంటోంది. గతంలో గర్భిణులకు ఐరన్ మెరుగుదల కోసం 100ఎంఎల్ సెలైన్ బాటిళ్ల సరఫరా ఉండేది. వాటి సరఫరా నిలిచిపోవడంతో 500ఎంఎల్ సెలైన్ బాటిళ్లను గర్భిణులకు ఎక్కిస్తున్నారు. 100 ఎంఎల్ సెలైన్ ఎక్కిస్తే సరిపోతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో 500 ఎంఎల్‌ను గర్భిణలకు ఎక్కిస్తూ వృథా చేయాల్సిన పరిస్థితి ఉంటోంది. దీని వల్ల 500 ఎంఎల్ ఎక్కించాల్సిన రోగులకు కొరత ఏర్పడనుంది.

అరకొరగా నిధులు



పీహెచ్‌సీకి అరకొర నిధుల మంజూరు కూడా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఏడాదికి రూ.1.75 లక్షలు మంజూరు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం రూ. 50వేలు మాత్రమే మంజూరు చేశారు. ఈ నిధులు ఏమూలకు సరిపోవడం లేదు. మరో మూడు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా మిగిలిన రూ.1.25లక్షలు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియడం లేదు. అరకొర నిధులను ఇప్పటికే వివిధ అవసరాలను ఆసుపత్రి వర్గాలు ఖర్చు చేశాయి. మరి కొంత మొత్తం చేతి నుంచి ఖర్చు చేసి పెండింగ్‌లో ఉన్న నిధుల కోసం ఎదురు చూస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలను పెంచడానికి ప్రయత్నిస్తున్నాం. వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి గర్భిణుల్లో చైతన్యం కల్పించాలని ఆదేశిస్తున్నాం. మందుల కొరతపై ఉన్నతాధికారులకు తెలిపాం.

– కేశవానంద, డాక్టర్

అప్రమత్తంగా ఉండాలి

యల్లనూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి లోకేష్‌కుమార్ సూచించారు. శనివారం నిట్టూరు, వెన్నపూసపల్లి, అచ్యుతాపురం సబ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వైద్యుడు మాట్లాడుతూ చలికాలంలో రోగులకు అస్తమా, జలుబు, దగ్గు, జ్వరాలు వచ్చే ఆస్కారం ఉందన్నారు. ఆరోగ్య సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సబ్ సెంటర్ ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని బ్రహ్మణపల్లికి చెందిన ఆరుగురు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గత ఏడాది ఎన్నికల అనంతరం జరిగిన ఘర్షణల్లో నిందితులుగా ఉన్న చెన్నారెడ్డి, రాజమోహన్‌రెడ్డి, బాబు రెడ్డి, రమేష్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు అరెస్టయ్యారు. రెండు రోజుల క్రితం రోడ్డు పనుల నిమిత్తం అనవసరంగా వైఎస్సార్‌సీపీ వర్గీయుడైన చెన్నారెడ్డి ప్రహరీని టీడీపీ మద్దతుదారులు కూల్చివేశారు. టీడీపీ మద్దతుదారులపై పోలీసులకు చెన్నారెడ్డి ఫిర్యాదు చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత సంఘటనపై పోలీసులపై టీడీపీ మద్దతుదారులు ఒత్తిడి తెచ్చి అరెస్టు చేయించారన్న ప్రచారం సాగుతోంది.

ఫ్యాక్షన్ కొనసాగిస్తే చర్యలు



నాకాబందీ చేస్తున్న సీఐ సత్యబాబు, సిబ్బంది

యల్లనూరు: ఫ్యాక్షన్ కొనసాగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. మండలంలోని మేడికుర్తి గ్రామంలో శనివారం తెల్లవారుజామున పోలీసుల నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేర చరిత్ర కల్గిన రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లు, గడ్డివాముల్లో సోదాలు చేశారు. ఎలాంటి మరణాయుధాలు లభించలేదని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో యల్లనూరు, పుట్లూరు పోలీసులు పాల్గొన్నారు.

బ్రహ్మణపల్లిలో కార్డెన్‌సెర్చ్



మాట్లాడుతున్న సీఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: మండలంలోని బ్రహ్మణపల్లి లో శనివారం అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ధరణిబాబు, సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో తరుచూ వైఎస్సార్‌సీపీ వర్గీయులను టార్గెట్ చేస్తూ టీడీపీ మద్దతుదారులు దాడులకు పాల్పడుతున్నారు. వాటి కారణంగా శాంతిభద్రతలకు భంగం కలగడంతోపాటు ప్రతీకారదాడులకు అవకాశం ఉండటంతో పోలీసులు ఇరు పార్టీలకు చెందిన వారి ఇళ్లు, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో హుస్సేన్ అనే వ్యక్తి ఇంట్లో 54 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, నిందితునిపై కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ శివగంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ప్రశాంత వాతావరణ ఏర్పడటానికి పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా

గార్లదిన్నె: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా సూచించారు. శనివారం కల్లూరులోని తరిమెల క్రాస్‌లో 44వ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ పలు వాహనాలు ఆపి, రికార్డులు సక్రమంగా లేని వారికి అపరాధ రుసుం విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ వాహనాల్లో పరిమితికి మించి ప్రజలు వెళ్లరాదన్నారు. ద్వి చక్ర వాహనదారులు హెల్మెట్, కారు, జీపు నడిపేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. మద్యం సేవించి,సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్



సమస్యలపై నిలదీస్తున్న వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి

గుత్తి: గుత్తి మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, చైర్ పర్సన్ వన్నూర్‌బీ శనివారం ఉదయం 11.30 గంటలకు సమావేశాశం ప్రారంభించారు. ప్రారంభంలోనే కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, ఫరూక్, అరవింద్ బాబు, వరదరాజులు పైకి లేచి పట్టనంలో కుక్కల బెడద, డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యలపై అధికారులను నిలదీశారు. అనంతరం వైస్ చైర్మన్ బిందె వరలక్ష్మితో పాటు మరి కొంత మంది కౌన్సిలర్లు పన్నులు చెల్లించకపోతే మహిళా సంఘాల సభ్యత్వాన్ని తొలగిస్తామని ఎలా చెప్పారని మున్సిపల్ అధికారులను నిలదీశారు. తాము అలా ప్రకటించలేదని కమిషనర్ సమాధానమిచ్చారు. అయినప్పటికీ కౌన్సిలర్లు శాంతించలేదు. పన్నులు కట్టకపోతే బెదిరించడం తగదన్నారు. పన్నులు వసూలు చేసుకునేందుకు ఓ పద్ధతి ఉంటుందన్నారు. అయితే ఇలా సభ్యత్వాన్ని, సంఘాల నుంచి తొలగిస్తామని చెప్పడం దారుణమన్నారు. మరోసారి ఇలాంటి ప్రకటనలు, బెదిరింపులు చేస్తే తీవ్ర పరిణామాలు హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మలతా రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' వెంటనే అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లు: అధికారంలోకి వస్తే ప్రతి బిడ్డకూ రూ.15వేలు ఇస్తామంటూ వాగ్దానాలు గుప్పించిన కూటమి ప్రభుత్వం.. అధికారం చేపట్టి ఏడు నెలలు గడిచినా తల్లికి వందనం పథకం గురించి పట్టించుకుపోవడం దారుణమని ఏఐఎస్ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు వినోద్‌కుమార్, కోశాధికారి అఖిల్ మండిపడ్డారు. తల్లికి వందనం పథకానికి మంగళం పాడటాన్ని వ్యతిరేకిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్, నారాలోకేష్ ఫొటోలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లా అధికారం వస్తే సూపర్‌సిక్స్ పథకం హామీల్లో భాగంగా ప్రతి బిడ్డకూ రూ.15 వేలు డబ్బులు చెల్లిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు కూటమి నాయకులు మాయమాటలు చెప్పి అధికారం చేపట్టారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరునెలలు గడిచినా ఇంతవరకూ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. నిన్న జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో వచ్చే ఏడాది నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని ప్రకటించి విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలు అడియాసలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి మద్యం షాపుల నిర్వహణపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్‌పై లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం స్పందించి తల్లికి వందనం పథకం వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు రోహిత్‌కుమార్, నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం

పెద్దపప్పూరు/శింగనమల/గుంతకల్లుటౌన్/గుత్తి, యాడికి: పెద్దపప్పూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని డిప్యూటీ కలెక్టర్ శిరిష ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్, తహసీల్దార్ బాలాజీ రావు, ఎంపీడీఓ శంకుంతల, ఎంఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.అలాగే శింగనమల కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రారంభించారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎంఈఓ నరసింహరాజు పాల్గొన్నారు. అదేవిధంగా గుంతకల్లులోని జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీకాంత్, ప్రిన్సిపల్ సాలాబాయి, కౌన్సిలర్ మహాలక్ష్మి ప్రారంభించారు. గుత్తిలోని కళాశాలలో ప్రిన్సిపాల్ మీనాక్షి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ పథకాన్ని ప్రారంభించారు. అలాగే యాడికిలోని మోడల్ కళాశాలలో ఎంఈఓ కాశెప్ప, ప్రిన్సిపాల్ మారుతి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



బాల్య వివాహాలు నిర్మూలిస్తామని పెద్దపప్పూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



పెద్దవడుగూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

పెద్దపప్పూరు/పెద్దవడుగూరు/యాడికి: బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ షాజిదా బేగం అన్నారు. శనివారం పెద్దపప్పూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీస్, సచివాలయ వెల్ఫేర్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. లింగ వివక్ష లేని సమాజంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రామలక్ష్మి, తహసీల్దార్ బాలాజీరావు, ఎంపీడీఓ శంకుంతల, ఎంఈఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులోని ఎంపీడీపీ కార్యాలయంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ షాజిదాబేగం, ఎంపీడీఓ నరసింహారెడ్డి, ఎస్ఐ ఆంజనేయులు, ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్, ఏపీఎం అబ్దుల్‌ఖలీల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, శంషాద్‌బేగం పాల్గొన్నారు. అదేవిధంగా యాడికిలోని ఎంపీడీఓ సమీవేశ భవనంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా ఉపాధ్యాయులు, మహిళా పోలీసులకు కిశోర వికాసంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. సీడీపీఓ షాజిదా బేగం, ఎస్ఐ రమణ, ఈఓపీఆర్డీ శశికళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఏపీఎం చంద్రశేఖర పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా నిర్వహించండి

గుంతకల్లు రూరల్: ఉపాధి పథకం కింద జరిగిన పనులకు సంబంధించి నిష్పక్షపాతంగా తనిఖీలు నిర్వహించాలని కోరుతూ శనివారం ఈఓఆర్డీ నాగభూషణంకు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి గానూ మండలంలో దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో వివిధ రకాల ఉపాధి పనులు చేశారన్నారు. ఈ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు క్షేత్రస్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో నిష్పక్షపాతంగా తనిఖీ నిర్వహించాలన్నారు. పనుల నిర్వహణలో అవినీతి అక్రమాలు జరిగినట్లు తేలితే, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

7న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కౌన్సిల్ హాల్‌లో ఈ నెల 7న ఉదయం 11 గంటలకు మున్సిపల్ (బడ్జెట్) ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ నయీమ్ అహ్మద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ఏఓపై అట్రాసిటీ కేసు నమోదు చేయండి

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో దళితవర్గానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులను బండబూతులు తిడుతూ మానసికంగా వేధిస్తున్న ఏఓ రామ్‌ప్రసాద్‌పై చర్యలు చేపట్టాలని రెవెన్యూ డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు హరిప్రసాద్ యాదవ్ కోరారు. శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజేంద్రరావును ఆయన కలిశారు. పారిశుద్ధ్య కార్మికుల ఇబ్బందులపై ఆరాతీశారు. అనంతరం ఏఓపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని హరిప్రసాద్ డిమాండ్ చేశారు.

మాజీ ఎంపీటీసీకి గాయాలు

యాడికి: కారు ఢీ కొనడంతో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని రాయలచెరువు గ్రామంలో శనివారం రాత్రి 9 గంటల సమయంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి నగరూరు క్రాస్ దాటే సమయంలో గుత్తి వైపు నుంచి వచ్చిన మధ్య ప్రదేశ్‌కు చెందిన కారు ఢీ కొంది. ఘటనలో రామాంజనేయులుకు వీపుపై గాయాలయ్యాయి. వెంటనే అతడిని బంధువులు రాయలచెరువులోని ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని తాడిపత్రికి తరలించారు .

వ్యక్తి అదృశ్యం

యాడికి: గత నెల 27 నుంచి తన భర్త కనిపించలేదని ఓ మహిళ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. మండలంలోని కూర్మాజిపేటకు చెందిన రామాంజనేయులు(36) గత ఏడాది డిసెంబర్ 27న రాయలచెరువులో ఉన్న బ్యాంకుకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అతడి భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని కుంటలో మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తున్న శ్రీరంగ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

బ్రెయిలీని ఆదర్శవంతంగా తీసుకోవాలి



లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహిస్తున్న అధికారులు

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ లూయిస్ బ్రెయిలీని ఆదర్శవంతంగా తీసుకోవాలని ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంధుల ల్లోనూ ఎంతో ప్రతిభ ఉంటుందని ప్రపంచానికి చాటిచెప్పిన శాస్త్రవేత్తగా లూయిస్ బ్రెయిలీ ఘనకీర్తిని సాధించారన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు ఆదినారాయణ ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ధర్నా జయప్రదం చేయండి'

గార్లదిన్నె: జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకుడు చెన్నారెడ్డి సూచించారు. శనివారం అయన మాట్లాడుతూ కూడేరు మండలం పాడి చెరువు నుంచి మర్తాడు, కోటంక గ్రామాల చెరువుకు నీరు అందేవన్నారు. కానీ పాడి చెరువు వద్ద ఓ రైతు అడ్డు వేయడంతో మర్తాడు, కోటంక చెరువులకు నీరు రాలేదన్నారు. చెరువులకు నీరు అందించాలని ఇరిగేషన్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపడతామన్నారు. మర్తాడు, కోటంక గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆందోళన కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లు రూరల్/గుత్తిరూరల్: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. శనివారం గుంతకల్లు మండల పరిధిలోని వైటీ.చెరువు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అలాగే గుత్తి మండలంలోని అబ్బేదొడ్డి, ఈశ్వరపల్లి గ్రామాల్లో తహసీల్దార్ ఓబిలేసు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పలు సమస్యలపై రైతులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు 35 శాతం రాయితీ

గుత్తి రూరల్: ప్రధాన మంత్రి ఆహార శుద్ధి క్రమబద్ధీకరణ (పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద ఆసక్తి ఉన్న వారు 35 శాతం రాయితీపై పరిశ్రమలు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన అధికారిణి మిత్రవింద మాధవి సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో హెచ్ఓ విలేకరులతో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ఔత్సాహిక వ్యాపారులు, యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలలోని వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరిశ్రమ విలువలో లబ్ధిదారులు 10 శాతం వాటా భరిస్తే 35 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. మిగిలిన 55 శాతం బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు 9553426060 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దుర్గాంజనేయ స్వామి ఆలయంలో చోరీ

శింగనమల: మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద ఉన్న దుర్గాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి దుండగులు ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు అలంకరించిన 4 కిలోల బరువైన వెండి కవచాలను అపహరించారు. అనంతరం దుర్గమ్మ గుడిలోనూ ప్రవేశించి పంచలోహ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం పూజలు చేయడానికి ఆలయానికి వెళ్లిన పూజారులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చోరీపై కేసు నమోదు చేశామని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.